## హామీల అమలుకు

# కట్టుబడి ఉన్నాం




**వెల్గటూర్, –నవభూమి:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నా రు. బుధవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు నిర్వాసితుల చెక్కులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులను ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి పంపిణీ చేశారు. ముక్కట్రావ్‌పేటకు చెందిన 24 మంది భూ నిర్వాసితులకు రూ.52 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. వెల్గటూర్ మండలానికి చెందిన 45 మందికి రూ.45,05,220 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులు, ఎండపల్లి మండలానికి చెందిన 31 మందికి రూ.31,03,596 విలువ గల చెక్కులు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడగానే సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకపోగానే స్పందించి మిగిలిన పరిహారాన్ని మం జూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. చెగ్యాం గ్రామానికి చెందిన 126 మంది నిర్వాసితులకు రూ.18 కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పది సంవత్సరాలు అధికారం లో ఉండి నిర్వాసితుల గురించి పట్టించుకోని వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తు న్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో, డీటీ సంతోష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మేరు గు మురళి, బందెల ఉదయ్, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం..పెగడపల్లి: ప్రతి పౌరుడికి మెరుగైన వైద్యచికిత్సలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండ లంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన అంగలి సంతోష్ అనారోగ్యంతో బాదపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చికిత్స ఖర్చులు పెట్టే ఆర్థిక స్థోమత లేక స్థానిక నాయకుల ద్వారా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు లక్ష్మణ్‌కుమార్ లక్ష రూపాయలు ఎల్‌వోసీ మంజూ రు చేయించి బాధితుడి తండ్రికి బుధవారం అందజే శారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కడారి తిరుపతి, పూసాల తిరుపతి, సంధి మల్లారెడ్డి, కుం చె రాజేందర్, తోట మల్లేశం పాల్గొన్నారు.

## నాడు హడావుడి..

# నేడు పట్టింపు కరవు





# నవభూమి కరీంనగర్

అనుబంధం

13 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in



## 'ఇందిరా మహిళా శక్తి'తో

# ఆర్థిక ప్రగతి



**కథలాపూర్, –నవభూమి:** కాంగ్రెస్ ప్ర భుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంతో గ్రామీణ మహిళలు ఆర్థిక పురోగతి సాధిస్తారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బొమ్మెనలో యుమునా మహిళా సంఘం ఎనిమిది లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ, కథలాపూర్‌లో మూడు లక్షలతో ఏర్పా టు చేసిన నాటుకోళ్ల యూనిట్లను ప్రారంభించిన అనంతరం విప్ మాట్లాడారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఇందిరా శక్తి పథకా నికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అనంత రం దుంపెటలో గణపతి మండపంలో ప్రత్యేక పూజ ల్లో పాల్గొన్నారు. 24 మందికి కల్యాణలక్ష్మి, 14 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వినోద్, ఏపీఎం నరహ రి, పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్, తదితరులు ఉన్నారు.మేడిపల్లి: రైతన్నకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నా రు. మేడిపల్లిలో 83 మంది లబ్ధిదారులకు షాదీముభా ర్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంత రం వల్లంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకు లు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, నాగరాజు, నర్సరెడ్డి, నర్స య్య, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.భీమారం: మండలంలోని ఒడ్యాడ్ గ్రామానికి చెంది న బీఆర్ఎస్ నాయకుడు ఒడ్డాడు రాజా, మాజీ ఉపస ర్పంచ్ సూర మహేష్, బైర అంజయ్య మేడిపల్లి మం డల కేంద్రంలో విప్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

# ఆక్రమణలో వరద కాలువ స్థలాలు



## వైద్య సేవలు మరింత వేగవంతం



**జమ్మికుంట:-నవభూమి:** వైద్య విధానపరిషత్ పరిధిలోని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగయ్యేందుకు జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించడంతో..అనేక గ్రామాలకు కేంద్రమైన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఇబ్బందులు తీరనున్నాయి. కొన్ని నెలలుగా పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. గత 6 మాసాలుగా గైనకాలిజిస్టు లేకపోవడంతో ఆసుపత్రిలో ప్రసవాలు నిలిపివేశారు. దీంతో గర్భిణులు హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి లేదా కరీంనగర్, వరంగల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. తాజాగా జిల్లా కలెక్టర్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వారంలో రెండు రోజులు ప్రసవాలు చేసేందుకు గైనకాలజిస్ట్ సోమశేఖర్‌ను నియమించారు. దీంతో ఆసుపత్రిలో సోమవారం, గురువారం గర్భిణులకు ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో ఒక హెడ్‌స్టాఫ్ నర్స్, 13 మంది నర్సులు, సిబ్బంది ఉన్నట్టు పేర్కొన్నారు. 8కి చేరిన వైద్యుల సంఖ్య ఇప్పటివరకు ఆసుపత్రిలో దంత, ఆర్థోపెడిక్, మరో నలుగురు వైద్యులతో కేవలం ఓపీ సేవలే అందేవి. తాజాగా వైద్యుల సంఖ్య 8కి పెరగడంతో మరిన్ని సేవలు అందనున్నాయి. ఆసుపత్రిలో ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి ఆహారాన్ని అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు ఉన్నా.. ఎక్స్‌రే సౌకర్యం లేకపోవడంతో డబ్బులు చెల్లించి వేరేచోట చేయించుకుంటున్నామని రోగులు వాపోతున్నారు. దంత వైద్యుడు ఉన్నా పూర్తిస్థాయిలో సేవలు అందించాల్సి ఉంది. ల్యాబ్ నిర్వాహకుడు ఒక్కరే ఉండటంతో పలు రకాల పరీక్షలు చేయడంలో ఇబ్బంది ఎదురవుతుంది. ఆసుపత్రిలో మరో ల్యాబ్ టెక్నీషియన్, సహాయకుడిని నియమించాలని కోరుతున్నారు. మెరుగైన వైద్యం అందిస్తాం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు, మెరుగైన వైద్యం అందించేందుకు దృష్టి సారిస్తాం. ఇప్పటికే వైద్యులకు, సిబ్బందికి సూచనలు చేశా. ఆసుపత్రిలో సోమవారం, గురువారం ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేస్తాం. ప్రస్తుతం అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

## ఆధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ

**వేములవాడ, -నవభూమి:** ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకొని నేరాలను నియంత్రించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రెనో వేషన్ చేసిన పోలీసు విశ్రాంతి భవనాన్ని, సీసీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో పోలీసు శాఖ వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం పోలీసింగ్ విధానంలో అనేక మార్పులు వచ్చాయని, అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నేరాల నియంత్రిస్తూ నిరంతరం సమాజ సేవ చేస్తున్నారని కొనియాడారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.



# ఆక్రమణలో వరద కాలువ స్థలాలు

**మెట్‌పల్లి:-నవభూమి:** జలవనరుల శాఖకు చెందిన విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వరద కాలువ అవసరాల కోసం సేకరించిన మిగులు భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి మిన్నకుండిపోతుండడంతో యథేచ్ఛగా వరద కాలువ స్థలాల ఆక్రమణలు, నిర్మాణాలు చేపడుతున్నారు. జగిత్యాల జిల్లాలో వరద కాలువ ఇబ్రహీంపట్నం మండలంలో 28వ కి.మీ నుంచి ప్రారంభమై మల్యాల మండలంలో 86వ కి.మీ వద్ద ముగుస్తోంది. సుమారు 58 కి.మీ పొడవున వరద కాలువ ఉంది. కాలువ నిర్మాణంతో పాటు తవ్విన మట్టి నిల్వకు అనుగుణంగా భూసేకరణ చేశారు. కాలువ నిర్మించడంతో పాటు ఇరువైపులా రహదారి, కాల్వ కోతకు గురి కాకుండా పటిష్ఠత కోసం మట్టిని పోశారు. ప్రధాన కాలువ మధ్యలో నుంచి ఇరువైపులా 70-100 మీటర్ల చొప్పున భూసేకరణ చేశారు. సరైన పర్యవేక్షణ, హద్దురాళు లేకపోవడంతో వరద కాలువ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాలకు సమీపంలో ఉన్న చోట మట్టి తరలించి చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మట్టి



తొలగించడంతో పలు చోట్ల వరద నీటికి కట్ట బలహీనపడి కోతకు గురై ప్రమాదకరంగా మారుతోంది. పక్కా నిర్మాణాలు.. పంటలు వరద కాలువ పటిష్ఠత కోసం పోసిన మట్టిని కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కాలువ మట్టిని అక్రమార్కులు తరలించడంతో ఖాళీ స్థలాలు ఏర్పడుతున్నాయి. దీంతో సమీపంలోని రైతులు స్థలాన్ని తమ భూమిలో కలిపేసుకొని చదును చేయడంతో పాటు దుక్కి దున్ని పంటల సాగు చేపడుతున్నారు. అంతే కాకుండా పలు చోట్ల పక్కా నిర్మాణాలు కూడా చేపట్టారు. ఆలయాలు, ప్రభుత్వ భవనాలు, ఫంక్షన్ హాళ్లు, కంపోస్టు షెడ్లు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు ఇలా పలు రకాలుగా వినియోగించుకుంటున్నారు. జలవనరుల శాఖ అధికారులు నోటీసులు ఇస్తున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అవసరాల కోసం వినియోగిస్తున్నందున చూసీచూడనట్లు వ్యవహరించాలని సూచిస్తుండడంతో ఏమీ చేయలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వరద కాలువ స్థలాలను ఆక్రమించడం పరిపాటైంది. నోటీసులు ఇస్తున్నాం వరద కాలువ స్థలాలను ఆక్రమించిన వారికి నోటీసులు ఇస్తున్నాము. పక్కా నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశిస్తున్నాము. చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాము.

# ప్రతిభ చాటితే నగదు ప్రోత్సాహం

**పెద్దపల్లి -నవభూమి:** విద్యార్థి దశలోనే పర్యావరణ పరిరక్షణపై పట్టు పెంచి, ఇంధన వనరులపై ఆసక్తి కలిగించేందుకు రెడ్కో(తెలంగాణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని ఆదేశించింది. జాతీయ స్థాయిలో ఎన్టీపీసీ యాజమాన్యం ఆర్థిక సహకారం తీసుకుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి ప్రకటించింది. జూనియర్, సీనియర్ విభాగాల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రెండు విభాగాల్లో ...ఇంధన శక్తిని పరిరక్షించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడేందుకు పాఠశాలల్లోని విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో చిత్రలేఖనం పోటీల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నారు. గ్రూప్'ఎ'లో 5, 6, 7వ తరగతి, గ్రూప్'బి'లో 8, 9, 10వ తరగతి విద్యార్థులుంటారు. ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలి ఇంధనశక్తి, పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ విద్యార్థి భాగస్వామ్యం అయ్యేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి. విద్యార్థులు ప్రతిభ చాటేందుకు మంచి అవకాశం. గుర్తింపుతో పాటు నగదు ప్రోత్సాహకం లభిస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.- సందీప్‌కుమార్, రెడ్కో సంస్థ మేనేజర్, ఉమ్మడి జిల్లా దరఖాస్తు విధానం ఇలా విద్యార్థి పెయింటింగ్స్ ఏ4 సైజ్ పేపర్‌లో వేయాల్సి ఉంటుంది. ప్రతీ పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించి అందులో మెరుగైన ప్రతిభచాటిన వారిని గుర్తిస్తారు. అత్యంత ఆసక్తికరంగా ఉన్న చిత్రాలను వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాలి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు రంగుల పెన్సిళ్లు, క్రేయాన్స్ తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఈమేరకు విద్యాశాఖ, ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ అధికారులు పాఠశాలల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. అంశాల వారీగా..పాఠశాలల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల చిత్రాలను అక్టోబరు 14 వరకు ఆన్‌లైన్‌లో పంపించాలి. రాష్ట్ర స్థాయిలో నవంబర్ 14న పోటీలు నిర్వహించి అందులో అత్యంత ప్రతిభ చాటిన వాటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అంశాల వారీగా ఎంపిక చేస్తారు. వాటిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. ప్రథమ స్థానానికి రూ. 50 వేలు, ద్వితీయకు రూ. 30 వేలు, తృతీయకు రూ. 20 వేలు, ఈ పోటీల్లో పాల్గొన్న మిగిలిన విద్యార్థులకు రూ. 2 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేస్తారు. డిసెంబర్ 14న ఇంధన వనరుల పరిరక్షణ దినోత్సవం లోగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు.



# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



**ఇల్లంతకుంట, -నవభూమి:** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని గాలిపెల్లిలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభమ య్యాయి. బద్దం ఎల్లారెడ్డి స్తూపం వద్ద నివాళులు అర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడారు. తెలంగాణ నిజాం సర్కార్ మెడలు వంచాలని బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, ముగ్దుంమొయినుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టు గెరిల్లాలు అమరత్వం పొందాయని, 300 గ్రామాలకు నిజాం పాలన నుంచి విముక్తి లభించా యని అన్నారు. భూస్వాములు, జమీందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వక్రీకరిస్తోందని, హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా పేర్కొంటోందని అన్నారు. ఓట్ల రాజకీయం చేస్తున్న బీజేపీని అన్నివర్గాల ప్రజలు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. సిరిసిల్లలో బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి కాంస్య విగ్రహాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వరకు సాయుధ పోరాట వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు మంద సుదర్శన్, నాయకుడు కదారి రాములు, మీసం లక్ష్మణ్, వేణు, శ్రావణపెల్లి మల్లేశం, ఏసీరెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మన్, రాజు, బాలయ్య, చంద్రం, బాలనర్సు, బాలమల్లు, బద్దం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఉన్నతీకరణ

**పెద్దపల్లి:-నవభూమి:** పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఉన్నతీకరణకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ఉత్తర్వులను వెలువరించింది. రైల్వేస్టేషన్ ఉన్నతీకరణతో పెద్దపల్లి స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పలు సూపర్ ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్‌లు లభించనున్నాయి. కాజీపేట, బల్హార్షా సెక్షన్‌లలో పెద్దపల్లి స్టేషన్ మాత్రమే ఎన్ఎస్‌జీ(నాన్ సబర్బన్ గ్రేడ్)-5 స్థాయి నుంచి ఎన్ఎస్‌జీ-4 స్థాయికి ఉన్నతీకరణ జరిగింది. దీంతో దక్షిణమధ్య రైల్వే జోన్‌లో ఎన్ఎస్‌జీ-4 స్టేషన్ల సంఖ్య 38కి పెరిగింది. ఈ సెక్షన్‌లోని రామగుండం, సిర్పూర్‌కాగజ్‌నగర్ స్టేషన్లు ఇప్పటికే ఎన్ఎస్‌జీ-4 స్థాయిలో ఉండగా, మంచిర్యాలతో పాటు కాజీపేట, వరంగల్ స్టేషన్లు ఎన్ఎస్‌జీ-3 స్థాయిలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జమ్మికుంట స్టేషన్లు ఎన్ఎస్‌జీ- 5 స్థాయిలో ఉన్నాయి. రైలు ప్రయాణికులు, టికెట్ల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం ఆధారంగా రైల్వే బోర్డు రైల్వేస్టేషన్ స్థాయిని నిర్ణయిస్తుంది. అందుకు అనుగుణంగా ప్రయాణికులకు వసతులను కల్పిస్తుంది. అమృత్‌స్టేషన్ నమూనాలో మార్పులు పెద్దపల్లి రైల్వేస్టేషన్ స్థాయి పెంపుపై గతంలోనే రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోవడంతో ఇక్కడ చేపట్టిన అమృత్ స్టేషన్ పనులు తాత్కాలింగా నిలిచిపోయాయి. మారిన స్టేషన్ స్థాయికి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసేందుకు పనులు నిలిపివేశారు. స్టేషన్ డిజైనింగ్ మార్చడంతో పాటు పలు సాంకేతిక అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు ప్రణాళికలకు అనుగుణంగా రైల్వేస్టేషన్ నమూనాను మార్చనున్నారు. రాఘవపూర్- మణుగూరు రైల్వే మార్గానికే కేంద్రం ఆమోదం తెలపడంతో సింగరేణి ప్రాంతాలకు కూడలిగా పెద్దపల్లి స్టేషన్ మారనుంది. సింగరేణి ప్రాంతాన్ని ప్రతిబింబించే విధంగా రైల్వేస్టేషన్ నమూనా రూపకల్పనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తుదిరూపం వచ్చిన తరువాతే అమృత్ స్టేషన్ పనులు మొదలయ్యే అవకాశముంది.




## నాడు హడావుడి..

# నేడు పట్టింపు కరవు





**కరీంనగర్ -నవభూమి:** పద్మనగర్‌లోని మానేరునగర్‌తోపాటు మరో రెండు వీధుల్లో రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. మొత్తం రూ.3 కోట్లతో ప్రారంభించిన పనులలో రూ.కోటి వరకే చేశారు. ఎనిమిది నెలలుగా ఆ ప్రాంతవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు నంబర్ 2లో రోడ్డు నిర్మించి కల్వర్టు నిర్మించకుండా వదిలేయడంతో అటుగా రాకపోకలు బంద్ అయ్యాయి. విద్యానగర్ ప్రాంతంలోని వేంకటేశ్వరగుడి రోడ్డుతో పాటు పలు వీధులలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు గతేడాది అక్టోబర్‌లో పనులు ప్రారంభించారు. ఇళ్ల ముందు యూజీడీ ఛాంబర్లు వేసి వదిలేయగా రహదారి నిర్మించకుండా పత్తా లేకుండా పోయారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ వైపు ఎవరు కన్నెత్తి చూడటం లేదు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గతేడాది అభివృద్ధి పనులను హడావుడిగా ప్రారంభించారు. ఆయా డివిజన్‌లలో రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీటి పైపులైను కోసం తవ్వుతుండటంతో స్థానికులు మురిసిపోయారు. వెంటనే పనులు పూర్తి చేసి సౌకర్యంగా మారుస్తామని చెప్పగా..ఒకట్రెండు పనులు చేసి మిగతావి ఎక్కడికక్కడే వదిలేశారు. ఇంకేముంది ఎప్పటిలాగే ప్రజల సమస్యలు మొదటికొచ్చాయి. 60 డివిజన్లు.. రూ.132 కోట్లు నగరంలోని 60 డివిజన్‌లలో ముఖ్యమంత్రి హామీ (సీఎంఏ) నిధులు రూ.132 కోట్ల పనుల్లో భాగంగా 60 ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాల్వల కోసం తవ్వి వదిలేశారు. తొమ్మిది నెలలుగా పనులను పెండింగ్‌లో పెట్టారు. కంకరపోసి వదిలేయడంతో నడిచి వెళ్లే వారికి, చిన్న వాహనాలపై వెళ్లే వారికి ఇబ్బందికరంగా మారింది. కొందరు రోడ్డు ఎత్తు చూసుకొని ర్యాంపులు కట్టుకుందామని అలాగే ఉంచడంతో ఎక్కడం, దిగడం గగనమైంది. మరికొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు నిర్మించి కల్వర్టులు కట్టకుండా వదిలేయడంతో మురుగు నీరు నిలిచి దుర్గంధంగా మారుతోంది. గుంతలతో నరకయాతన వర్షాలతో రహదారులు గుంతలు పడ్డాయి. శిథిలమైన సీసీ రోడ్లు రెండుగా చీలి ప్రమాదాలు జరుగుతున్నాయి. కట్టరాంపూర్, జీపీ నగర్, తిరుమల్‌నగర్, భగత్‌నగర్, పద్మనగర్, తీగలగుట్టపల్లి, సీతారాంపూర్, బోయవాడ, హనుమాన్‌నగర్, విద్యానగర్, రేకుర్తి, అశోక్‌నగర్, రాంనగర్, గాయత్రీనగర్, రాఘవేంద్రనగర్, కాపువాడ, బ్యాంకుకాలనీ, వావిలాలపల్లి, ఆరెపల్లి, సదాశివపల్లి ప్రాంతాల్లో తవ్వి వదిలేసిన రోడ్లు, మురుగునీటి కాల్వలు అసంపూర్తిగా ఉన్నాయి. బిల్లులు ఇప్పించాలంటూ టెండర్ దక్కించుకొని సగం మేర పనులు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతుండగా అధికారులు మాత్రం ఆ గుత్తేదారు దారిలో ఉంటున్నారు. నగరవాసుల సమస్యలను గుర్తించి నోటీసులు జారీ చేసి అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఒకే ప్యాకేజీ కింద పనులు అప్పగించడంతోనే ఈ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, డివిజన్ల వారీగా టెండర్ అప్పగిస్తే ఈ పనులన్నీ ఎప్పుడో పూర్తి చేసుకునే వారమని కార్పొరేటర్లు అంటున్నారు. భగత్‌నగర్ ఎన్‌జీవోఎస్ కాలనీ రోడ్డు నంబర్ 6సీ వైపు కల్వర్టు నిర్మించకపోవడం, కాలువ మధ్య మట్టి పోయడంతో వర్షానికి కొట్టుకుపోయింది. రాంచంద్రపూర్ కాలనీ నుంచి వచ్చే ప్రజలు ఇటుగా వెళ్తుంటారు. పలుమార్లు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన కింద పడుతున్నారు. విలీన కాలనీలో మురుగునీటి కాలువలు నిర్మించేందుకు ప్రతిపాదించి పనులు కొంతమేర ప్రారంభించారు. ఆ తర్వాత అవి ఆగిపోవడంతో మురుగునీరంతా ఖాళీ స్థలాల్లోకి వెళ్తోంది. పనులు చేయాలని కాలనీవాసులు, కార్పొరేటర్లు కోరుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ఆదేశాలు జారీచేస్తాం..సంబంధిత ఏజెన్సీని పిలిపించి పనులు చేయాలని ఆదేశాలిస్తాం. ఏఏ పనులు ఎంతమేర ఆగిపోయాయో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తాం. సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేస్తాం.

# భూకేటాయింపులు పకడ్బందీగా జరగాలి

**మంథని, -నవభూమి:** మంథని పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన భూ కేటాయింపులు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పట్టణంలోని, శివారు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను కలెక్టర్ శ్రీహర్ష జేసీ అరుణశ్రీతో కలిసి బర్రెకుంట, బాయ్స్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, ఏఎంసీ సమీపంలోని దేవదాయ శాఖ, డిగ్రీ కళాశాల సమీపంలోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని బుధవారం పరిశీలించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాత డపింగ్ యార్డులో లెవలింగ్ పనులు చేపట్టాలన్నారు. పట్టణంలో సమీకృత వెజ్, నాజ్‌వెజ్ మార్కెట్ నిర్మాణం, నూతన మున్సిపల్ భవన నిర్మాణం, సబ్‌స్టేషన్, ఆర్డీవో, తహసీల్దార్ ఆఫీసుల నిర్మాణాల కోసం అనువైన ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల స్కెచ్‌లను పూర్తి చేసి, ఏ అభివృద్ధి కార్యక్రమానికి ఎక్కడ వీలుగా ఉంటుందో నివేదిక సమర్పించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

